

సబ్సిడీ రుణాలు

కులవృత్తుల వారికి ప్రభుత్వం చేయూతనం దిస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. 8లో▸



అధికారుల డుమ్మా

మండల పరిషత్ సమావేశానికి కింది స్థాయి అధికారులను పంపడంపై ఎమ్మెల్యే కిషన్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. 8లో▸



లింక్ రోడ్ల అభివృద్ధికి నిధులు

లింక్‌రోడ్ల అభివృద్ధికి రూ.16కోట్ల నిధులు కేటాయించామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా గోపాల్



హుడాకాంప్లెక్స్: భారత సాంస్కృతిక స్నేహ సంఘం (ఇస్కఫ్) సభ్యులు సోమవారం నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్.గోపాల్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఆర్.ప్రభాకర్‌రావు, పీవీ దుర్గాప్రసాద్, మునీర్ పటేల్, కార్యదర్శులుగా ఎం.అంజయ్య, ఉస్మాన్‌అలీ అజార్, కార్యవర్గ సభ్యులుగా ఏ.నజీర్‌ఖాన్, దొడ్డా వెంకటయ్య, విజయలక్ష్మి, కోశాధికారిగా కె.చందు, కౌన్సిల్ సభ్యులుగా ఎండీ ఫైమిదా, ఎండీ మహబూబ్, పాపయ్య, బాలకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. సంస్థ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని అన్నారు. తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావాణికి 295 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 295 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. సాధ్యమైనంత వరకు దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని, నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు పిల్లలందరికీ టీకాలు వేయించాలి



టీకాల గురించి వివరిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర రావు

తుర్కయంజాల్:ఐదేళ్లలోపు పిల్లలందరికీ పూర్తిస్థాయి టీకాలు వేయించి ఆరోగ్య రక్షణ కల్పించాలని జిల్లా వైద్యాధికారి డా. వెంకటేశ్వర రావు అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని సోమ వారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. గతంలో ఏవైనా కారణాలతో పూర్తిస్థాయిలో టీకాలు ఇప్పించని వారు ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు వేయించాలని సూచించారు. ఈ టీకాలతో పొంగు, రుబెల్లా వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా టీకాల అధికారి డా. స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి

కందుకూరు: సీజనల్ వ్యాధులు సోకకుండా తగు చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అధికారులను ఆదేశించారు. మహేశ్వరం ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సాయంత్రం సీజనల్ వ్యాధులపై మండలంలోని అన్ని పీహెచ్‌సీల వైద్యులు, పంచాయతీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. దోమలు ఎక్కువ కాకుండా నిరంతరం ఫాగింగ్ చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. విద్యార్థులు స్కూల్ నుంచి వెళ్లిపోయాక సాయంత్రం పాఠశాలల పరిసరాల్లో సైతం ఫాగింగ్ చేయించాలన్నారు. తాగునీటి ట్యాంకులు తరచూ శుద్ధి చేయాలన్నారు. లీకేజీలుంటే వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ఆశ వర్కర్ల ద్వారా మెడికల్ అధికారులు ఫీవర్ సర్వే చేయించాలన్నారు. తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్లలో ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నారని, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ప్రజలు డబ్బు వృథా చేసుకోకుండా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘుమారెడ్డి, కొత్తపడకల్ ఎంపీటీసీ చంద్రయ్య, దుబ్బచర్ల సర్పంచ్ సీత్యారెడ్డి, ఎంపీటీసీ అనితారాంరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ గీత పాల్గొన్నారు.

చల్లంగ చూడమ్మ..



బోనంతో మహిళ

పోచమ్మ బోనాలను సోమవారం కడ్తాల్‌లో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మహిళలు పసుపు, కుంకుమలతో.. రంగురంగులతో బోనం కుండలను చూడ ముచ్చటగా అలంకరించారు. నెత్తిన బోనంతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పుల దరువులు.. పోతురాజుల విన్యాసాలు.. కళాకారుల ఆటపాటలతో బోనాల ఊరేగింపు ఆద్యంతం ఉత్సాహంగా సాగింది.

– కడ్తాల్



బోనాల ఊరేగింపులో సందడి

సెప్టెంబర్ 17 నువ్వా? నేనా!

పోటాపోటీ సభలతో గ్రేటర్‌లో పొలిటికల్ హీట్



- 17న జనసమీకరణపై నేతల దృష్టి
- తుక్కుగూడకు సోనియా, ఖర్గే ఇతర కాంగ్రెస్ అగ్రనేతలు
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌కు కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా రాక
- మాసబ్‌ట్యాంక్‌లో ఎంఐఎం సభ.. హాజరు కానున్న ఎంపీ అసదుద్దీన్
- రంగారెడ్డి జిల్లా సరిహద్దులో భారీ సభకు బీఆర్ఎస్ సన్నాహాలు..

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ప్రజల మద్దతు కూడగట్టేందుకు గ్రేటర్ జిల్లాలే వేదికగా బహిరంగ సభలు ఏర్పాటు చేస్తున్నాయి. తుక్కుగూడ వేదికగా కాంగ్రెస్ విజయభేరి సభ నిర్వహిస్తుంటే..సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదికగా బీజేపీ బల ప్రదర్శనకు సిద్ధమవుతోంది. నిజానికి వరంగల్ వేదికగా అమిత్‌షా సభ నిర్వహించాలని భావించినప్పటికీ.. ఆ తర్వాత పార్టీ తన నిర్ణయాన్ని సికింద్రాబాద్‌కు మార్చుకుంది. ఇక అధికార బీఆర్ఎస్ అంతకు ఒక రోజు ముందే (16న)పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా శివారులోని నాగర్‌కర్నూలు జిల్లాలో నిర్వహించే భారీ బహిరంగ సభకు గ్రేటర్ జిల్లాల నుంచే భారీగా జనాన్ని తరలించాలని నిర్ణయించింది.

తుక్కుగూడకు సోనియా

సెప్టెంబర్ 15, 16 తేదీల్లో హోటల్ తాజ్‌కృష్ణ వేదికగా సీడబ్ల్యూసీ సమావేశాలు నిర్వహిస్తుండగా, ఇందుకు ఏఐసీసీ అగ్రనేత సోనియా సహా పార్టీ ప్రముఖులంతా హాజరుకానున్నారు. సమావేశాల ముగింపు రోజున (17న) తుక్కుగూడ వేదికగా వంద ఎకరాల విస్తీర్ణంలో లక్షలాది మందితో కాంగ్రెస్ విజయ భేరీ సభ నిర్వహిస్తుంది. ఇదే వేదిక నుంచి ఎన్నికల శంఖారావాన్ని పూరించనుంది. ఈ బహి రంగ సభకు హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లా ల్లోని ఒక్కో నియోజకవర్గం నుంచి కనీసం 25 వేల మందికి తగ్గకుండా తరలించాలని ఆయా నియో జకవర్గాల నేతలకు టార్గెట్లు విధించింది. ఇదిలా ఉంటే తుక్కుగూడ సభకు ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సోమవారం భూమిపూజ నిర్వహించారు.

పరేడ్ గ్రౌండ్‌కు అమిత్‌షా

ఈనెల 17న తెలంగాణ విమోచనదినాన్ని పురస్కరించుకుని రక్షణశాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదికగా నిర్వహించనున్న జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరు కానున్నారు. కాంగ్రెస్ సభకు పోటీగా బీజేపీ శ్రేణులు కూడా ఈ వేడుకలకు భారీగా జనాన్ని సమీకరించాలని నిర్ణయించారు. కంటోన్మెంట్, సికింద్రాబాద్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, ముషీరాబాద్, అంబర్ పేట్, కూకట్‌పల్లి, సనత్‌నగర్, ఎల్బీనగర్, మహేశ్వరం, కల్వకుర్తి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల నుంచి కనీసం యాభై వేల మందిని తరలించాలని నిర్ణయించారు. ఈ మేరకు బూత్ కమిటీల వారీగా టార్గెట్లు కూడా ఇచ్చారు.

మాసబ్‌ట్యాంక్‌లో ఎంఐఎం ర్యాలీ, సభ

ప్రధాన పార్టీలతో పాటు ఎంఐఎం సైతం సెప్టెంబర్ 17న ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. జాతీయ సమైక్యత దినోత్సవం పేరుతో నాంపల్లిలోని దర్గా యూసఫియన్ నుంచి బైక్‌ర్యాలీ చేపట్టి, మాసబ్ ట్యాంక్‌లోని హాకీ స్టేడియంలో మధ్యాహ్నం రెండు గంటలకు భారీ బహిరంగ సభను నిర్వహించాలని నిర్ణయించింది. ఎంఐఎం ముఖ్య నేత అసదుద్దీన్ ఓవైసీ సహా పార్టీ ప్రముఖులంతా ఈ సభకు హాజరు కానున్నారు. పాతబస్తీ నుంచి భారీగా జనాన్ని సమీకరించి, అధికార బీఆర్ఎస్, బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెసుకు తాము ఏమాత్రం తీసిపోబోమని చాటిచెప్పనుంది. కేవలం 24 గంటల వ్యవధిలోనే నాలుగు పార్టీలు..నాలుగు ప్రాంతాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తుండటంతో జనసమీకరణ నేతలకు పెద్ద సమస్యగా మారింది.

జనసమీకరణపై సమావేశం

తుక్కుగూడ వేదికగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించతలపెట్టిన విజయ భేరి సభను విజయవంతం చేసి తీరాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం ఆరాంఘర్‌లో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన జనసమీకరణ సన్నాహక సమావేశం నిర్వహించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు వేం నరేందర్‌రెడ్డి ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ సహా పార్టీ ప్రముఖులంతా హాజరు కాబోతున్న ఈ సభకు పది లక్షల మందికి తగ్గకుండా తరలించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సభ నిర్వహించే మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేయాలని సూచించారు. జనసమీ కరణ కోసం 3000 బస్సులను సిద్ధం చేసినట్లు చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, సీనియర్ నేతలు గౌరీ సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే ఏళ్ల తరబడి పార్టీ జెండానే నమ్ముకుని, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టత కోసం కష్టపడిన సామాన్య కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు లభించడం లేదని పలువురు నేతలు పరిశీలకుల ముందే వాపోయారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కష్టపడిన ప్రతి కార్యకర్తకు తప్పకుండా తగిన స్థానం కల్పించనున్నట్లు చెప్పి.. అసంతృప్తితో ఉన్న నేతలను పీసీసీ ఉపాధ్యక్షుడు వేం నరేందర్‌రెడ్డి సముదాయించడం కొసమెరుపు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తాం

ప్రధాన ఎన్నికల అధికారితో కలెక్టర్ హరీశ్



సాక్షి, రంగారెడ్డి జిల్లా: వచ్చే ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ లక్ష్యంగా పని చేస్తున్నామని కలెక్టర్ హరీశ్ చెప్పారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ.. బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో కూడిన 116 బృందాలు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల సహకారంతో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాయన్నారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు, అర్హులైన ఓటర్లందరినీ నమోదు చేయడానికి వివిధ కార్యక్రమాలు చేపడుతూ, అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంబంధిత ఈఆర్ఓలు, ఎఈఆర్ఓలు పాల్గొన్నారు.

అక్రమ నల్లా కనెక్షన్లపై కొరడా

సాక్షి, సిటీబ్యూరో: అక్రమ నల్లా కనెక్షన్‌లపై జలమండలి కొరడా ఝుళిపించింది. పైపులైన్ ద్వారా అక్రమంగా నల్లా కనెక్షన్ తీసుకున్న ఇద్దరితోపాటు వారికి సహకరించిన మరో వ్యక్తిపై జలమండలి విజిలెన్స్ అధికారులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. మేడిపల్లి సెక్షన్ పరిధిలోని ఎస్ఐఎస్ కాలనీకి చెందిన పి.సత్యనారాయణ అధికారుల అనుమతి లేకుండా స్థానికంగా ఉండే టి.తిరుపతి, శ్రీధర్‌లకు 20 ఎంఎం పరిమాణం గల రెండు అక్రమ నల్లా కనెక్షన్లు ఇప్పించాడు. జలమండలి విజిలెన్స్ అధికారుల తనిఖీలో ఈ విషయం బయట పడటంతో వారిపై స్థానిక మేడిపల్లి పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రి స్థాయి పెంపు

- రూ.17.50 కోట్లతో ఆమనగల్లులో 50 పడకల ఆస్పత్రి భవనం
- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: పట్టణంలోని 30 పడకల ప్రభుత్వాస్పత్రిని స్థాయి పెంచుతూ 50 పడకల ఆస్పత్రిగా మార్చినట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వెల్లడించారు. ఆస్పత్రి భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.17.50 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. వారం రోజుల్లో ఆస్పత్రి భవన నిర్మాణానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి హరీశ్‌రావ్ శంకుస్థాపన చేస్తారని చెప్పారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని సోమవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణ, పరిసరాలు, గదులను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించడానికి పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, మున్సిపాలిటీ టీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, కడ్తాల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కంబాల పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

సాయుధ పోరాట స్ఫూర్తితో పోరాడుదాం

- సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

చేవెళ్ల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై పోరాడుదామని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. చేవెళ్లలో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట 75వ వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా తెలంగాణ సాయుధ పోరాట యోధులైన దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంబేడ్కర్‌భవనంలో నిర్వహించిన సమావేశంలో జంగయ్య మాట్లాడుతూ.. భూమికోసం, భుక్తికోసం, తెలంగాణ విముక్తి కోసం జరిగిన పోరాటంలో చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొయినొద్దీన్ లాంటి ఎంతోమంది యోధులు తమ ప్రాణాలను అర్పించారన్నారు. ఈనెల 17న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే భారీ బహిరంగ సభకు రైతులు, కర్షకులు, కార్మికులు ప్రజా సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ప్రభులింగం, కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు బి. సుభాన్‌రెడ్డి, పార్టీ మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

వేలం పాడారు.. చేతులెత్తేశారు

- మోకిలాలో 10 ప్లాట్‌ల బిడ్డింగ్‌ను రద్దు చేసిన హెచ్ఎండీఏ

సాక్షి, సిటీబ్యూరో: మోకిలాలో హెచ్ఎండీఏ స్థలాలను ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో కొనుగోలు చేసిన బిడ్డర్లు తాజాగా చేతులెత్తేశారు. సకాలంలో మొదటి వాయిదా (ఇనీషియల్ డిపాజిట్) 25 శాతం చెల్లించకపోవడంతో మొదటి దశలో కొనుగోలు చేసిన 10 మంది బిడ్డర్లను హెచ్ఎండీఏ అనర్హులుగా ప్రకటించింది. ఈ మేరకు వారి బిడ్డింగ్‌ను రద్దు చేస్తూ క్యాన్సలేషన్ లెటర్స్‌ను అందజేసినట్లు పేర్కొంది. భవిష్యత్తులో హెచ్ఎండీఏ నిర్వహించే బిడ్డింగ్‌లలో పాల్గొనకుండా అనర్హత వేటు వేసింది. మోకిలాలోని హెచ్ఎండీఏ స్థలాలను అధికారులు రెండు దశలుగా ఆన్‌లైన్ వేలం వేసిన సంగతి తెలిసిందే. మొదటి దశలో 50 ప్లాట్లను వేలం వేయగా అత్యధికంగా గజం రూ.1,05.000 చొప్పున ధర పలికింది. సగటున గజానికి రూ.80,397 చొప్పున విక్రయించారు. కొనుగోలు చేసిన హెచ్1 బిడ్డర్‌లలో ప్లాట్ నెంబర్లు 241, 242, 263, 273, 282, 283, 284, 312, 313, 322 నెంబర్ ప్లాట్లపైన నిర్ణీత గడువులోగా 25 శాతం ముందస్తు డిపాజిట్ చెల్లించకపోవడం గమనార్హం. హెచ్ 1 బిడ్డర్లుగా ఎంపికైన వారు బ్రోచర్లలో ముద్రించిన విధంగా నిర్ణీత గడువులోగా మొదటి వాయిదా చెల్లించకపోవడంతో వారిపైన అనర్హత వేటు వేయడంతో పాటు ఈఎండీ మొత్తాన్ని తిరిగి చెల్లించబోమని హెచ్ఎండీఏ అధికారులు స్పష్టం చేశారు.

తప్పుడు సర్టిఫికెట్లు పెడితే క్రిమినల్ కేసులే

- డీఈఓ సుశీందర్‌రావు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్పౌజ్‌పాయింట్లు, ప్రిఫరెన్షియల్ కేటగిరీ పాయింట్లపై తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించిన ఉపాధ్యాయులను గుర్తించి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. ఉపాధ్యాయ బది'లీలలు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. బదిలీలు, పదోన్నతుల విషయంలో తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తప్పుడు మెడికల్ సర్టిఫికెట్ల కలకలం

ఇదిలా ఉంటే కొంత మంది ఉపాధ్యాయ సంఘం నేతలు సీనియార్టీ కోసం జీఓ నంబర్ 5కు విరుద్ధంగా తప్పుడు వైద్య ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. నిజానికి 70 శాతం అంగవైకల్యం ఉన్న వారికే ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉన్నా.. 30 శాతం అంగవైకల్యం లేని వారికి కూడా ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిసింది. భౌతికశాస్త్రంలో ఇటు వంటి వారు ముగ్గురు ఉన్నట్లు సమాచారం. 2013లో జరిగిన ప్రమాదం ఆధారంగా తీసుకున్న సర్టిఫికెట్‌తో ఓ సంఘం నాయకుడు ప్రస్తుతం సీనియార్టీలో ముందుండటం గమనార్హం. సదరం సర్టిఫికెట్‌ను మొదటి ఐదు సంవత్సరాలు తాత్కాలిక ప్రతిపాదికన, ఆ తర్వాత శాశ్వత ప్రతిపాదికన ఇస్తారనే అంశాన్ని కూడా విద్యాశాఖ అధికారులు మర్చిపోవడాన్ని పరిశీలిస్తే ఈ నకిలీ సర్టిఫికెట్ల మకిలీ విద్యాశాఖకు ఏమేర అంటుకుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. భార్యాభర్తల విషయంలో ఎవరో ఒకరు మాత్రమే వాడాల్సిన పది పాయింట్లు ఇద్దరు వాడుకోవడం గమనార్హం.

వేము వందనంకు అవార్డు

రాజేంద్రనగర్: ఆర్యణి సకల కళావేదిక సంస్థ గౌతమేశ్వర సాహితి కళాసేవ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి కవితా పోటీల్లో రాజేంద్రనగర్‌కు చెందిన కవి వేము వందనం ప్రథమ బహుమతి సాధించారు. సోమవారం కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో జరిగిన వేడుకల్లో అవార్డును ప్రదానం చేశారు.

మెథడిస్ట్ జిల్లా యూత్ అధ్యక్షుడిగా ప్రణయ్



మెథడిస్ట్ సంఘం జిల్లా యూత్ కార్యవర్గ సభ్యులు

మొయినాబాద్: మెథడిస్ట్ సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడిగా కాడిగళ్ల ప్రణయ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ ఎన్నికలో జిల్లా యూత్ ఉపాధ్యక్షుడిగా నందు, కార్యదర్శిగా కిషోర్, కోశాధికారిగా దీపక్, సభ్యులుగా రాహుల్, ఎరిక్, నిఖిత, నితీషను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో మెథడిస్ట్ సంఘం జిల్లా అధికారి విజయరత్నం సోమవారం ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు రాహుల్, యువకులు చిరంజీవి, శ్రీకాంత్, శ్రీధర్, ప్రశాంత్, ప్రభుచరణ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోషూట్‌కు వెళ్లి వస్తుండగా..

- డీసీఎంను ఢీకొట్టిన కారు
- తండ్రి మృతి, ముగ్గురికి తీవ్రగాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఫొటో షూట్‌కు వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లా తెనాలి మండలం నందులపేట గ్రామానికి చెందిన మల్లికార్జున్ వృత్తిరీత్యా ఫొటోగ్రాఫర్. ఓ సారీ ఫంక్షన్ ఆర్డర్ ఫొటోషూట్‌కు కొడుకు దీపక్‌సాయి మరో ఇద్దరు సహాయకులు అబ్దుల్ రావుఫ్, వీరవెంకట్‌తో కలిసి శంకర్‌పల్లిలోని త్రిపుర రిసార్ట్స్‌కి వెళ్లారు. షూట్ ముగించుకుని వారి సొంతకారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఎగ్జిట్ నంబర్ 12 వద్ద మొదటి లైన్‌లో వెళ్తున్న భారీ వాహనం నెమ్మదిగా వెళ్తుండడంతో ఆ వాహనాన్ని దాటవేసి పక్కలైన్‌లో వెళ్తున్న డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మల్లికార్జున్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా కుమారుడు, సహాయకులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రెచ్చిపోతున్న గొర్రెల దొంగల ముఠా

తంగెళ్లపల్లిలో 45 జీవాల అపహరణ

కొందుర్గు: ఇటీవల చేవెళ్ల పరిధిలో 20 గొర్రెల అపహరించిన దొంగలను రిమాండ్ తరలించిన ఘటన మరువక ముందే మరో సారి ఈ ముఠా రెచ్చిపోయింది. కొందుర్గు ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని తంగెళ్లపల్లికి చెందిన భిక్షపతి రోజుమాదిరిగానే ఆదివారం రాత్రి తన 200 గొర్రెలను ఇంటి ఎదుట ఉన్న దొడ్లో తోలాడు. సోమవారం ఉదయం చూసే వరకు 45 గొర్రెలు తక్కువగా ఉన్నాయి. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

అదనపు కట్నం కోసం వేధింపులు

నలుగురిపై కేసు

కొందుర్గు: అదనపు కట్నం కోసం వేధిస్తున్న నలుగురు వ్యక్తులపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన ప్రకారం.. ఆగిర్యాల గ్రామానికి చెందిన సౌజన్య, చుక్కమెట్టు గ్రామానికి చెందిన అరవింద్ ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లి సమయంలో కట్నం ఇవ్వనందున అత్తింటి వారు వేధించారు. దీంతో సౌజన్య తల్లిపేరిట ఉన్న భూమిని తాకట్టు పెట్టి నగదు, ఒక బొలేరో వాహనం ఇప్పించారు. కొన్నాళ్లపాటు వీరి సంసారం సాఫీగానే సాగింది. ఇటీవల మళ్లీ భర్త అరవింద్‌తోపాటు అత్త, మామ రాములమ్మ, రాములు, భావ శేఖర్ అదనపు కట్నం కోసం వేధింపులు మొదలుపెట్టారు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లింక్ రోడ్ల అభివృద్ధికి రూ.16 కోట్లు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్ రూరల్: లింక్‌రోడ్ల అభివృద్ధికి రూ.16కోట్ల నిధులు కేటాయించామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాయద్య అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నక్షత్రం జీవంతు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లింక్‌రోడ్ల పనులకు శంకుస్థాపన చేశామని త్వరలోనే పనులు ప్రారంభిస్తారని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా పనిచేస్తూ అభివృద్ధి సాధించాలన్నారు. సీఎం కేసీఆర్ చొరవతో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో ఎక్కువ నిధులు మొయినాబాద్ మండలానికే కేటాయించామన్నారు. ప్రతీ పంచాయతీ రూ.10లక్షల చొప్పున రూ.3కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. వర్షాకాలం ముగిసిన వెంటనే ఈసీ, మూసీ వాగులపై వంతెనలు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కాలె శ్రీకాంత్, ఎంపీడీఓ సంధ్య, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు మోర శ్రీనివాస్, సర్పంచ్‌లు మనోజ్‌కుమార్, శోభావెంకట్‌రెడ్డి, స్వరూపాఅంద్రూ, శ్రీనివాస్‌ముదిరాజ్, ఎంఈఓ వెంకటయ్య, పశువైద్యాధికారి దేవిరెడ్డి, డాక్టర్ శ్రీలతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేవనెత్తిన ప్రజాప్రతినిధులు

గ్రామాల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని సర్పంచ్‌లు మనోజ్‌కుమార్, శోభ, చందన సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎన్కేపల్లిలో ఇనుప స్తంభాలకు కరెంట్ షాక్ వస్తుందని చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో అటెండర్లు లేక చెత్త పేరుకుపోతుందన్నారు. కనకమామిడి నుంచి వెంకటపూర్ వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా ఎందుకు ప్రారంభించడం లేదని సర్పంచ్ మనోజ్ ప్రశ్నించారు. పశువైద్యాధికారులు విధుల్లో అలసత్వం వహిస్తున్నారని ఎంపీటీసీ శ్రీనివాస్ సభ దృష్టికి తెచ్చారు. చిలుకూరు, మొయినాబాద్, బాలాజీ టెంపుల్-హిమాయత్ సాగర్ రోడ్డు దుస్థితిపై సర్పంచ్ స్వరూపాఅంద్రూ ప్రశ్నించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధింత అధికారులకు సూచించారు.

సమావేశాలకు అధికారుల డుమ్మా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- విద్యుత్ ఏడీని పిలిపించాలని ఆదేశం

హయత్‌నగర్: మండల పరిషత్ సమావేశానికి ఉన్నతాధికారులు రాకుండా క్రింది స్థాయి అధికారులను పంపడంపై ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీపీ బుర్ర రేఖాగౌడ్ అధ్యక్షతన అబ్దుల్లాపూర్‌మెట్ మండపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విద్యుత్ ఏడీకి బదులుగా ఏఈ, ఆర్టీసీ డీఎంకు బదులుగా కింది స్థాయి అధికారి హాజరవ్వడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. వెంటనే విద్యుత్ ఏడీని పిలిపించాలని ఆదేశించారు. ఆర్టీసీ అధికారులు సమావేశానికి మొక్కుబడిగా వస్తున్నారని.. బస్సు సర్వీసుల వివరాలు ఇవ్వాలని మూడు నెలల క్రితం కోరినా ఇప్పటి వరకు ఇవ్వలేదని ఎంపీపీ సమావేశం దృష్టికి తెచ్చారు. కింది స్థాయి అధికారుల రావడం వల్ల ప్రయోజనం ఉండదని, వారికి ఎలాంటి బాధ్యతలుండవని ఎమ్మెల్యే అన్నారు. దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మమతాభాయి, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌దత్ తదితరులు పాల్గొన్నారు.

ధన్యవాదాలు తెలిపిన రైతులు

పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించి బండరావిరాల అసైన్‌మెంట్ భూముల సమస్యను పరిష్కరించి రైతులకు పరిహారం ఇప్పించడంపై ఆ గ్రామ ప్రజాప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. లష్కర్‌గూడా బ్రిడ్జి నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేయడంతో పరిసర గ్రామాల ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే మంచిరెడ్డికి చప్పట్లతో కృతజ్ఞతలు తెలిపారు.

డ్రగ్స్ సరఫరా ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్: గోవా నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్న ముఠాను రాజేంద్రనగర్ ఎస్ఓటీ, మోకిల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 51.45 గ్రాముల కొకైన్, 44 ఎండీఎంఏ మాత్రలు, 8 గ్రాముల ఎండీఎంఏ పౌడర్, మూడు ఆయిల్ బాటిళ్లు, ఏటీఎం కార్డు, ఐదు సెల్‌ఫోన్‌లు, మూడు కార్లు, రూ.97,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు..గచ్చిబౌలి టీఎన్‌జీఓస్ కాలనీకి చెందిన లింగంపల్లి అనురాధ భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటోంది. డ్రగ్స్‌కు బానిసైన ఆమె తరచూ గోవాకు వెళ్లి కొకైన్‌తో పాటు ఎండీఎంఏ మాత్రలను తీసుకువచ్చి వినియోగించేది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆమె వాటిని నగరానికి తీసుకువచ్చి పరిచయస్తులకు విక్రయించేది. ఈ నేపథ్యంలో అనురాధకు గచ్చిబౌలిలోని వరలక్ష్మి టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు ప్రభాకర్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. అతడికి మత్తు పదార్థాలకు అందజేసి అతడి ద్వారా ఇతరులకు విక్రయించేది. వీరితో జూబ్లీహిల్స్ నవ నిర్మాణ్‌నగర్‌కు చెందిన హోటల్ నిర్వాహకుడు వెంకట శివ సాయి కుమార్ జత కలిశాడు. ముగ్గురు ముఠాగా ఏర్పడి నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్నారు. అనురాధ తరచూ ఫ్లైట్‌లో గోవాకు వెళ్లి ఓ నైజీరియన్ వద్ద డ్రగ్స్ కొనుగోలు చేసి ట్రావెల్ బస్సులు, ట్రావెల్ కార్లలో తిరిగి వచ్చేది.

ఆదివారం మధ్యాహ్నం ఓఆర్ఆర్ ఇంద్రారెడ్డి నగర్ ప్రాంతంలో ముగ్గురు సమావేశమై అనురాధ తీసుకువచ్చిన డ్రగ్స్‌తో పాటు ఎండీఎంఏ మాత్రలను షేర్ చేసుకుంటుండగా. అప్పటికే పక్కా సమాచారంతో అక్కడ మాటు వేసిన రాజేంద్రనగర్ ఎస్ఓటీ, మోకిల పోలీసులు వారిని రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి డ్రగ్స్‌తో పాటు మూడుకార్లు, సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుల సెల్‌ఫోన్లలో ఉన్న సమాచారం ఆధారంగా ఎవరికి విక్రయించారు. ఎవరితో సంప్రదింపులు జరిపారు.. తదితర అంశాలపై దర్యాప్తు చేపట్టనున్నట్లు డీసీపీ వెల్లడించారు. ప్రస్తుతం నిందితులను రిమాండ్‌కు తరలించామని కోర్టు అనుమతితో వారిని కస్టడీకి తీసుకుని పూర్తిస్థాయి విచారణ చేపడతామన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ పరిమళ్‌రెష్మి, ఎస్ఓటీ డీసీపీ ఎం.ఏ.రషీద్, ఏసీపీ లక్ష్మీనారాయణ, మోకిల ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్ఓటి ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

కులవృత్తులకు సబ్సిడీ రుణాలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



జ్యోతి ప్రజ్వలన చేసి అష్టావధానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: కులవృత్తుల వారికి చేయూతనందిస్తూ ప్రభుత్వం గ్రామీణ ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొత్తూరు మండల కొడిచెర్ల గ్రామానికి చెందిన వివిధ నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టి ఇంటింటికీ కృష్ణా జలాలను అందిస్తుందని అన్నారు. రైతును రాజు చేయాలనే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విగళ అష్టావధానం

పట్టణంలోని ఠాగూర్ పాఠశాల ఆవరణలో ఉన్న రంగరాయ ఆడిటోరియంలో శ్రీ కళామంజరి ఆధ్వర్యంలో నిర్వహించిన ద్విగళ అష్టావధానం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభించారు. ఉభయ కళాతపస్వి నుసరావు చంద్రశేఖర్ శర్మ, రంప సాయికుమార్ శర్మలు అష్టావధానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవధాన కళానిధి మురళి, సాహిత్యరత్న బ్రహ్మ శ్రీ బంకుపల్లి రమేశ్‌శర్మ, విజయ్‌కుమార్, శంకరశర్మ, సాకేత్ ప్రవీణ్, రవీంద్రాచారి, వీరబ్రహ్మేంద్రచార్య, లక్ష్మీ మానస, రవిప్రకాష్ హర్మాక్, లక్ష్మీకాంతరావు, డాక్టర్ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

రాజేంద్రనగర్: గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి వెల్లడించారు. గణష్ ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం రాజేంద్రనగర్ పత్తికుంటను ఏసీపీ గంగాధర్, సీఐ నాగేంద్రబాబు, గణేష్ ఉత్సవ కమిటి సభ్యులతో కలిసి ఆయన సందర్శించిన అనంతరం మాట్లాడారు. ప్రజలంతా పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వై.శ్రీధర్, మల్లారెడ్డి, ఇంద్రపాల్‌రెడ్డి, రామేశ్వర్, రవి, బాల్‌రెడ్డి, బాబురావు, వెంకోబా, ఎలక్ట్రిసిటీ ఏఈ హాతిరాం, జగన్, రాజు, వినోద్, రాజు, కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ పనులు వేగిరం

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: పాలనా వికేంద్రీకరణతో రాష్ట్రంలో పారదర్శక పాలన సాగుతోందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆయన మండల విద్యావనరుల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ సబ్ డివిజన్ (ఉప కార్య నిర్వాహక పంచాయతీ ఇంజనీర్) కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కడ్తాల్ మండలానికి మహర్దశ పట్టనుందన్నారు. పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటుతో కడ్తాల్, తలకొండపల్లి మండలాలకు సంబంధించిన పంచాయతీరాజ్ పనులు వేగిరమవుతాయన్నారు. ఏసీడీఎఫ్, ఎండీఎఫ్, ఎస్‌డీఎఫ్, సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ గ్రాంట్స్‌తో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. కడ్తాల్‌లో కేజీబీవీ, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నయని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఎంపీడీఓ భవనం, స్త్రీశక్తి భవనం, ఉప్పరాశికుంట సుందరీకరణ పనులు ఇప్పటికే ప్రారంభించామని గుర్తు చేశారు. ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం రూ17.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకంతో నియోజకవర్గంలో 2.50లక్షల ఎకరాలు సస్యశ్యామలమవుతుందన్నారు. 19 వేల ఎకరాల్లో ఫార్మాసిటీ, ఫార్మా యూనివర్సిటీ, ఫార్మా టౌన్‌షిప్‌తో పాటుగా ఈ ప్రాంతానికి మెట్రో రైలు మార్గం, రీజినల్ రింగ్ రోడ్డుతో ఈ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, ఉప సర్పంచ్ రామకృష్ణ, పీఆర్ డీఈ తిరుపతిరెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణ, డీటీ వినోద్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌యాదవ్, జైపాల్‌నాయక్, సర్పంచ్‌లు తులసీరాం, పాండునాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబ ఎంపీటీసీలు సభ్యులు లచ్చిరాంనాయక్, గోపాల్, రమేశ్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, గ్రామ అధ్యక్షుడు నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవితేజ, పీఆర్ ఏఈ పరమేశ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.